హాలీవుడ్, బాలీవుడ్ సినిమా పరిశ్రమకు అడ్డాగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

సాగిన ప్రతిష్టాత్మక "తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ - 2024" ప్రదానోత్సవంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి , ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.."స్వాతంత్రం సిద్ధించి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న 2047 నాటికి దేశం ఆర్థికంగా బలోపేతం కావాలంటే సినిమా రంగం కూడా ఒక పరిశ్రమగా రాణించాలి. 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, వచ్చే 10 ఏళ్ల నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించాలంటే సినీ పరిశ్రమ కూడా అభివృద్ధి సాధించాలి.

సినిమా రంగం అభివృద్ధి సాధించడానికి పరిశ్రమకు ఏం కావాలో చెప్పండి. ఏ హోదాలో ఉన్నా మీకు అండగా నిలబడుతా. అన్ని రకాల ప్రోత్సాహకాలను అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. తెలంగాణకు ఎవరైనా రావొచ్చు. ఎవరైనా వాణిజ్యం నిర్వహించవచ్చు. 500 ఫార్చూన్ కంపెనీల్లో 85 కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. ప్రపంచ నగరాలతో పోటీ పడదలచుకున్నాం.

తెలుగు సినీ పరిశ్రమలను గుర్తించడానికి 1964 లో ఈ అవార్డులను ఇవ్వాలని నిర్ణయించి అప్పటి నుంచి 2014 వరకు నిరాటంకంగా నిర్వహించారు. వివిధ కారణాల చేత 14 ఏళ్ల కిందట ఆగిపోయిన సినిమా అవార్డుల ప్రదానోత్సవాన్ని పునరుద్ధరించాలని దిల్ రాజు ప్రతిపాదించారు. వాటిని పునరుద్ధరించడమే కాకుండా గడిచిన పదేండ్ల కాలంలో ప్రతిభ కనబరిచిన అందరినీ అభినందించాలని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. అందుకు సహకరించిన సినీ రంగానికి అభినందనలు. కొన్ని అంశాల్లో ప్రభుత్వ నిర్ణయాలు కఠినంగా కనిపిస్తాయి. కానీ ప్రభుత్వం సినిమా రంగాన్ని అభిమానంగా చూస్తుంది. ఇప్పుడే కాదు గతంలోనూ మా ప్రభుత్వాలు సినిమా రంగాన్ని గౌరవించింది. ఇంత అద్భుతమైన కార్యక్రమం ఏర్పాటు చేసిన నిర్వహకులకు, అందుకు సహకరించిన సినీ రంగ ప్రముఖులందరికీ అభినందనలు.గద్దరన్న స్ఫూర్తితో ప్రభుత్వం ముందుకు వెళుతోంది. తెలంగాణ అభివృద్ధిలో సినీ పరిశ్రమ భాగస్వామ్యం కావాలి. అందరం కలిసికట్టుగా తెలంగాణ అభివృద్ధికి పాటుపడాలి. తెలంగాణను అభివృద్ధి వైపు నడిపించడంలో కళా చైతన్యం తోడుగా నిలవాలి.." అని ముఖ్యమంత్రి కోరారు.2014 నుంచి 2024 వరకు ప్రతి ఏటా ఆయా కేటగిరీల్లో ఎంపికైనా ఉత్తమ చిత్రాలతో పాటు నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సంగీత, సాహిత్యకారులు, సాంకేతిక నిపుణులు, చిత్రపరిశ్రమలో విశేష కృషి చేసిన ప్రముఖులకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ అందజేశారు.

45 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నాం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా సింగరేణి సంస్థ "ప్రతీ అడుగు పచ్చదనం" నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతోందని దీనిలో అధికారులు, ఉద్యోగులు, స్థానికులు అందరూ పాల్గొనేలా చూడాలని సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల్లోని జీఎంలతో వివిధ అంశాల పైన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది వన మహోత్సవంలో 675 హెక్టార్లలో 45 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని దీనిని విజయవంతం చేయడం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. "నీటి బిందువు జలసింధువు" కార్యక్రమంలో భాగంగా మొత్తం 62 మినీ చెరువుల నిర్మాణంలో ఇప్పటికే 60 చెరువులు పూర్తి చేశామన్నారు. మిగతావి మరో వారం రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సింగరేణి వ్యాప్తంగా సమీప గ్రామాల్లో 43 చెరువుల్లో మట్టి పూడికలు తీయాలని నిర్ణయించగా ఇందులో ఇప్పటి వరకు కేవలం నాలుగు మాత్రమే పూర్తయ్యాయని, ఇవి త్వరగా పూర్తి చేయడానికి ప్రత్యేక దృష్టి సారించాలని సీఎండి ఆదేశించారు. వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించడం కోసం ఇకపై జి 14, జి 15 గ్రేడ్ కు బదులుగా జి 13 గ్రేడ్ బొగ్గును సరఫరా చేయటానికి తగు ఏర్పాటు చేయాలని జనరల్ మేనేజర్లను ఆదేశించారు. చిన్న తరహా పరిశ్రమల వారు తమకు కావలసిన తక్కువ మోతాదు బొగ్గును సింగరేణి ఏరియాలకు వచ్చి తీసుకువెళ్లడంలో ఇబ్బందులు గమనించామని, వీరి సౌకర్యం కోసం హైదరాబాద్ కు సమీపంలో ఒక బొగ్గు విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని సంబంధిత అధికారులని ఆదేశించారు. భూపాలపల్లి ఏరియాలోని భూగర్భ గనులలో సాండ్ స్టోయింగ్ కోసం గోదావరి నది నుండి ఇసుక సేకరణకు గాను వెంటనే క్వారీ ఏర్పాటుకు అనుమతులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఈ అండ్ ఎం డి. సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ కె. వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం సుభాని, జనరల్ మేనేజర్ సి పి పి మనోహర్, జనరల్ మేనేజర్ మార్కెటింగ్ ఎన్.వి. రాజశేఖర్ రావు, కార్పొరేట్ నుంచి వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, ఏరియాల్లోని జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

మూడోసారి సిట్ విచారణకు ప్రభాకర్‌రావు

విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు పెంచింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ ఓఎస్‌డీ ప్రభాకర్‌రావు సిట్ ఎదుట మూడోసారి విచారణకు హాజరయ్యారు. తొలుత శనివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌పోలీస్‌స్టేషన్‌లోని సిట్‌కార్యాలయానికి వచ్చారు. అమెరికా నుంచి వచ్చిన తర్వాత ఇప్పటికే ఆయనను సిట్ బృందాలు రెండుసార్లు సుదీర్ఘంగా ప్రశ్నించాయి. శనివారం మూడో సారి విచారించింది. మరో వైపు శుక్రవారం ప్రణీత్‌రావును విచారించిన సిట్ అధికారులు ఆయన నుంచి నమోదు చేసిన వాంగ్మూలం ద్వారా ప్రభాకర్‌రావును ప్రశ్నించినట్లు సమాచారం. ముఖ్యంగా గత ప్రభుత్వంలో ఎస్ఐబీ చీఫ్‌గా పనిచేసిన సమయంలోనే ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. ప్రభాకర్ రావు విచారణతో ఈ కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని సిట్ బృందం భావిస్తోంది. గత ప్రభుత్వంలో ఎవరు చెబితే ఫోన్ ట్యాపింగ్ జరిగిందనే అంశంపై, అలాగే ఎంతమంది రాజకీయ, సినీ ప్రముఖులు, న్యాయమూర్తులు, జర్నలిస్టుల ఫోన్లు ట్యాప్ చేశారనే కోణంలో సిట్ అధికారులు దర్యాప్తు చేయనున్నారు. గత ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ఆర్థిక సహాయం చేసిన వారి ఫోన్‌లను కూడా ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

తాళ్లగడ్డలో మాజీ కౌన్సిలర్ కెక్కిరేణి సత్యనారాయణ కుమారుడు శ్రీ దుర్గా బిల్డర్స్ ఓనర్, బ్రైట్ ఫ్యూచర్ ఫౌండేషన్ ఫౌండర్, జిల్లా యువజన నాయకుడు కెక్కిరేణి శివకుమార్ గౌడ్ పరమపదించారని తెలుసుకొని వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గండూరి ప్రకాష్, వై వెంకటేశ్వర్లు,కెక్కిరేణి నాగయ్య గౌడ్, ఆకుల లవకుశ, బూర బాల సైదులు గౌడ్, పల్స వెంకన్న గౌడ్, టైసన్ శీను గౌడ్, జే జానీ, కెక్కిరేణి ఆనంద్ గౌడ్, నాగరాజు, కృష్ణ, రామ్మూర్తి, జానకి రాములు తదితరులు.

ఘనంగా గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం

విశ్వంభర, తెలంగాణ బ్యూరోః హైదరాబాద్ లోని హైటెక్స్ వేదికగా రాష్ట్రప్రభుత్వం గద్దర్ అవార్డుల వేడుకను జూన్ 14, శనివారం రాత్రి ఘనంగా నిర్వహించింది. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎఫ్డీసీ ఛైర్మన్, ప్రొడ్యూసర్ దిల్ రాజు తదితరులు ఈ వేడుకకు హాజరయ్యారు. 2014 నుంచి 2023 వరకూ.. ఏడాదికి మూడు సినిమాలను ఉత్తమ సినిమాలుగా ఎంపిక చేపి.. ఒక్కొక్క సినిమాకు బెస్ట్ హీరో, బెస్ట్ హీరోయిన్, బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ ప్రొడ్యూసర్ అవార్డుల్ని అందజేశారు. నిర్మాతలకు గోల్డ్, డైరెక్టర్లకు సిల్వర్, హీరో అండ్ హీరోయిన్లకు బ్రాంజ్ మెమెంటో, ప్రశంసాపత్రాలను అందజేశారు.

2014
ఫస్ట్ బెస్ట్ మూవీ : రన్ రాజా రన్
సెకండ్ బెస్ట్ మూవీ : పాఠశాల
థర్డ్ బెస్ట్ మూవీ : అల్లుడు శీను
2015
ఫస్ట్ బెస్ట్ మూవీ : రుద్రమదేవ
సెకండ్ బెస్ట్ మూవీ : కంచె
థర్డ్ బెస్ట్ మూవీ : శ్రీమంతుడు
2016
ఫస్ట్ బెస్ట్ మూవీ : శతమానం భవతి
సెకండ్ బెస్ట్ మూవీ : పెళ్లి చూపులు
థర్డ్ బెస్ట్ మూవీ : జనతా గ్యారేజ్
2017
ఫస్ట్ బెస్ట్ మూవీ : బాహుబలి ది కన్ క్లూజన్
సెకండ్ బెస్ట్ మూవీ : ఫిదా
థర్డ్ బెస్ట్ మూవీ : ఘాజీ
2018
ఫస్ట్ బెస్ట్ మూవీ : మహానటి
సెకండ్ బెస్ట్ మూవీ : రంగస్థలం
థర్డ్ బెస్ట్ మూవీ : కేరాఫ్ కంచరపాలెం
2019
ఫస్ట్ బెస్ట్ మూవీ : మహర్షి
సెకండ్ బెస్ట్ మూవీ : జెర్సీ
థర్డ్ బెస్ట్ మూవీ : మల్లేశం
2020
ఫస్ట్ బెస్ట్ మూవీ : అల వైకుంఠపురములో
సెకండ్ బెస్ట్ మూవీ : కలర్ ఫొటో
థర్డ్ బెస్ట్ మూవీ : మిడిల్ క్లాస్ మెలొడీస్
2021
ఫస్ట్ బెస్ట్ మూవీ : RRR
సెకండ్ బెస్ట్ మూవీ : అఖండ
థర్డ్ బెస్ట్ మూవీ : ఉప్పెన
2022
ఫస్ట్ బెస్ట్ మూవీ : సీతారామం
సెకండ్ బెస్ట్ మూవీ : కార్తికేయ 2
థర్డ్ బెస్ట్ మూవీ : మేజర్
2023
ఫస్ట్ బెస్ట్ మూవీ : బలగం
సెకండ్ బెస్ట్ మూవీ : హనుమాన్
థర్డ్ బెస్ట్ మూవీ : భగవంత్ కేసరి

ఇక స్పెషల్ అవార్డ్స్ లో నందమూరి బాలకృష్ణకు ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డు, మణిరత్నంకు పైడి జైరాజ్ అవార్డు, డైరెక్టర్ సుకుమార్ కు బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డు, అట్లూరి పూర్ణ చంద్రరావుకు నాగిరెడ్డి అండ్ చక్రపాణి ఫిల్మ్ అవార్డు, విజయ్ దేవరకొండకు కాంతారావు ఫిల్మ్ అవార్డు, యండమూరి వీరేంద్రనాథ్ కు రఘుపతి వెంకయ్య అవార్డులు అందజేశారు.

తిరుమల హాథిరామ్ మఠంలో తెలుగు పీఠాధిపతులకు అవకాశమివ్వాలి

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును కోరిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

విశ్వంభర, హైదరాబాద్ : తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి కొండపై ఉన్న హాథిరామ్ బావాజీ మఠంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన బంజారా పీఠాధిపతులకు మాత్రమే పూజలు చేసే అవకాశం ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం బంజారాహిల్స్ లోని నివాసంలో పలువురు బంజారా పీఠాధిపతులు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో సమావేశమయ్యారు. తిరుమలలోని హాథిరామ్ బావాజీ మఠంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన బంజారా పీఠిధిపతులకు కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన పీఠాధిపతులకు అవకాశం ఇచ్చారని తెలిపారు. తమకు అవకాశం ఇచ్చేలా టీటీడీ చైర్మన్, పాలకవర్గంపై ఒత్తిడి తేవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుతో ఫోన్ లో మాట్లాడారు. శ్రీ హాథిరామ్ బావాజీ మఠంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కు చెందిన బంజారా పీఠాధిపతులు మాత్రమే పూజలు చేసేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు స్పందిస్తూ పాలక మండలి సమావేశంలో చర్చించి దీనిపై నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు.

మీడియా ప్రజల హక్కులు కాపాడాలి

విశ్వంభర, హైదరాబాద్: భావప్రకటన స్వేచ్ఛ ఉన్నప్పటికీ మీడియా ప్రజల హక్కులను కాపాడాలని ఇఫ్లూ వైస్ ఛాన్సిలర్ రాజారావు అన్నారు. సంచలనాలకు ప్రాధాన్యమివ్వకుండా సరైన సమాచారాన్ని ప్రజలకు అందించాలని సూచించారు. ఇటీవల ప్రతివిషయాన్నిసంచలనం చేసే ధోరణి పెరిగిందని,సామాజిక మాధ్యమాలు వచ్చిన తర్వాత అసత్యాలు కూడా వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ప్రభుత్వం రూపొందించే పథకాలు, పాలసీలపై సమగ్రంగా అవగాహన చేసుకుని ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత కూడా పాత్రికేయులపై ఉందన్నారు. జాతీయ విద్యా విధానంమీడియా పాత్ర అనే అంశంపై వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా ఓయూ కాలేజి ఆఫ్ ఎడ్యుకేషన్, ఆంధ్రమహిళా సభ కాలేజి ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ శుక్రవారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సంయుక్తంగా నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జర్నలిస్టులు జాతీయ ప్రయోజనాల కోసం కృషి చేయాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ సూచించారు., సీనియర్ పాత్రికేయుడు వల్లీశ్వర్, ఇఫ్లూ పూర్వ డీన్ సుధాకర్, యూనివర్సిటీ బీఎడ్ కాలేజి ప్రిన్సిపల్ రవీంద్రనాథ్ కె.మూర్తి , అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లలిత తదితరులు మాట్లాడారు. సమాజాన్నిచైతన్య పరచడంలో జర్నలిస్టులు, విద్యావేత్తల పాత్ర కీలకమని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ ఇద్దరినీ ఒక వేదికపైకి తీసుకురావడం ద్వారా వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా ఒక మంచి ఒరవడికి శ్రీకారం చుట్టిందని వారు కొనియాడారు. జాతీయ విద్యావిధానం2020ను అమలు చేయాల్సిన అవసరాన్ని వారు వివరించారు. దీని గురించి ఉన్న అపోహలను తొలగించాలని జర్నలిస్టులకు సూచించారు. రెండో సెషన్‌లో పలువురు విద్యావేత్తలు జాతీయ విద్యావిధానం, అమలులో ఉన్న సవాళ్లు,పరిష్కార మార్గాలపై అధ్యయన పత్రాలు సమర్పించి ప్రసంగించారు. ఎర్రోజు శ్రీనివాస్, డాక్టర్ రాజారాం, డాక్టర్ రాధిక (పాండిచ్చేరి), ఉపేందర్, డబ్ల్యూజేఐ గౌరవాధ్యక్షుడు నందనం కృపాకర్ ప్రసంగించారు. ముగింపు సదస్సులో ప్రముఖ విద్యావేత్త మురళీ మనోహర్ కీలకోపన్యాసం చేశారు. డబ్ల్యూజేఐ రాష్ట్ర అధ్యక్షుడు రాణాప్రతాప్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కరుణాకర్ తదితరులు ప్రసంగించారు. హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రముఖ పాత్రికేయుడు ఎంవీఆర్ శాస్త్రిలు వీడియో సందేశం పంపారు. జాతీయ విద్యావిధానాన్ని అమలు చేయాల్సిన అవసరముందన్నారు. ఈ అంశంపై సదస్సు నిర్వహించిన వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధులను అభినందించారు.

పాత్రికేయులకు ఉత్తమ పురస్కారాల ప్రదానం..

ఉత్తమ ప్రతిభకనబరిచిన జర్నలిస్టులకు వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) శుక్రవారం జాతీయ పురస్కారాలను ప్రదానం చేసింది. ప్రింట్ , ఎలక్ట్రానిక్, డిజిటల్ మాధ్యమాల్లో పలువురిని ఘనంగా సన్మానించింది. (డబ్ల్యూజేఐ) జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ, సీనియర్ పాత్రికేయుడు వల్లీశ్వర్, విద్యావేత్త మురళీమనోహర్ తదితరుల చేతుల మీదుగా ఈ పురస్కారాలు అందజేశారు. ప్రముఖ పాత్రికేయుడు, ఆంధ్రభూమి మాజీ సంపాదకులు, రచయిత ఎంవీ ఆర్ శాస్త్రికి జీవన సాఫల్య పురస్కారం ప్రకటించారు. ఇక ప్రింట్ మీడియా కర్నాటి లక్ష్మీనారాయణ (ఎడిటర్), ఎన్ ఎస్ రావు (పరిశోధనాత్మక కథనం),మణి కుమార్ , చర్ల (మానవీయ కథనం), అయోధ్య రామయ్య (గ్రామీణ), శ్రీధర్ (ఫొటో గ్రాఫర్), ఆర్.మహేందర్ (లే ఔట్ ఆర్టిస్ట్), డా.భాస్కర యాదవ్ (కాలమిస్ట్), ఆసరి రాజు (ఉపసంపాదకుడు) లకు అవార్డులు అందజేశారు. ఎలక్ట్రానిక్ మీడియా నుంచి , డి.శ్రీనివాస్ (ఔట్‌పుట్ ఎడిటర్‌టీవీ9),తేజ (రిపోర్టర్99 టీవీ), సురేశ్‌రెడ్డి (సబ్ ఎడిటర్, వీ6), అనిల్ (గ్రాఫిక్స్‌టీవీ5), నిమ్మగడ్డ సింధూర (యాంకర్ టీ న్యూస్), చంద్రిక (న్యూస్ హోస్ట్, ఏబీఎన్)లకు పురస్కారాలు ఇచ్చారు. రమేశ్ వైట్ల (ఇన్‌పుట్ ఎడిటర్, ఎన్‌టీవీ)కు అవార్డు ప్రకటించారు. డిజిటల్ మీడియా నుంచి రాకేశ్, భరత్ (ఇంటర్వ్యూయర్, జీ న్యూస్)లకు అవార్డులు ప్రదానంచేశారు.

జూన్ 19న శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర

విశ్వంభర, నేషనల్ బ్యూరో : భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్రకు సంబంధించిన కొత్త తేదీ ఖరారైంది. సాంకేతిక సమస్యలతో ఈ రోదసియాత్ర పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కొత్త తేదీని ప్రకటించింది. యాక్సియం 4 కింద మరో ముగ్గురు ఆస్ట్రోనాట్లతో కలిసి శుభాంశు జూన్ 19న రోదసియాత్రకు బయలుదేరనున్నట్లు ఇస్రో తెలిపింది. ఈనెల 11న ప్రయోగానికి ముందు రాకెట్‌లో లిక్విడ్ ఆక్సిజన్ లీక్ అవుతున్నట్లు అధికారులు గుర్తించిన సంగతి తెలిసిందే. ఈ సమస్యను విజయవంతంగా పరిష్కరించామని ఇస్రో వెల్లడించింది. ఈనేపథ్యంలో కొత్త ప్రయోగ తేదీని ప్రకటించింది.

అమెరికాకు చెందిన వాణిజ్య అంతరిక్ష సంస్థ 'యాక్సియం స్పేస్' ఈ మిషన్‌ను నిర్వహిస్తోంది. ఇస్రో, అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా), ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ)లు ఇందులో భాగస్వామ్యం వహిస్తున్నాయి. ఈ స్పేస్ క్యాప్సూల్‌ను ఫాల్కన్9 రాకెట్ నింగిలోకి మోసుకెళుతోంది. ఇందులో శుభాంశు మిషన్ పైలట్ బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ ప్రయోగం తొలుత మే 29న జరగాల్సి ఉంది. అయితే, వాతావరణం అనుకూలించకపోవడం, సాంకేతిక సమస్య తలెత్తడం వంటి కారణాలతో పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. ఇక, భూమి నుంచి బయల్దేరిన 28 గంటల తర్వాత ఈ వ్యోమనౌక.. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) తో అనుసంధానమవుతుంది. శుభాంశు బృందం అక్కడే 14 రోజుల పాటు ఉంటుంది. భారత హిత స్థితిలో పలు ప్రయోగాలు నిర్వహించడంతో పాటు ప్రధాని మోదీ, పాఠశాల విద్యార్థులు, ఇతరులతో ముచ్చటిస్తారు.

బనకచర్ల టెండర్లు వెంటనే నిలిపివేయాలి

(మొదటి పేజీ తరువాయి)

సూచన ఇందుకు అద్దం పడుతుందని తెలిపారు. అప్పటికే పీఎఫ్ఆర్ ఆమోదించినట్లు భావించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. డీపీఆర్ సమర్పించడం అంటే సీడబ్ల్యూసీ ఆమోదించినట్లే అవుతుందా అని ప్రశ్నించారు. ప్రాజెక్ట్ కోసం కేంద్రాన్ని నిధుల కోసం ఒత్తిడి చేసిన అంశాన్ని జనవరి 22,2025న కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్‌తోపాటు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాసిన విషయాన్ని సైతం ప్రస్తావించారు. ఏపీ సీఎం ఈ ప్రాజెక్టు కోసం 2024, నవంబర్ 15న, డిసెంబర్ 29న కేంద్రప్రభుత్వాన్ని ఆశ్రయించారని తెలిపారు.మొత్తం ఈ ప్రాజెక్టుకు అయ్యే వ్యయం రూ.80,113 కోట్లు కాగా.. గోదావరి నుండి కృష్ణా వరకు రూ.13,511 కోట్లు అవుతుందని, కృష్ణా నుండి బొల్లపల్లి రిజర్వాయర్‌కు రూ.28,560 కోట్లు ఖర్చు అవుతుందని లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు. అదేవిధంగా బొల్లపల్లి నుండి బనకచర్ల హెడ్ రెగ్యులెటరీకి రూ.38,041 కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారని పేర్కొన్నారు. కేంద్ర జలవనరుల కమిషన్‌తోపాటు గోదావరికృష్ణా నది బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేకుండానే ఈ ప్రాజెక్టు ప్రక్రియ ముందుకు సాగుతున్నదని మండిపడ్డారు. జీడబ్ల్యూడీటీ అవార్డు ప్రకారం చూసినా 1,486 టీఎంసీలలో 968 టీఎంసీలు తెలంగాణకు కేటాయించబడ్డాయని, ఈ నీటి వాటా కేటాయింపులపై సీడబ్ల్యూసీ, జీఆర్ఎంబీ ఆమోదం కోసం వేచిచూస్తున్న తరుణంలో ఏపీ ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులను ఎలా ప్రతిపాదిస్తుందని మంత్రి ఉత్తమ్ ప్రశ్నించారు. నీటి కేటాయింపులు లేకుండా ప్రాజెక్టులు నిర్మించే నైతికత ఏపీకి ఎక్కడిదని నిలదీశారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఇచ్చిన లేఖలో సైతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి స్థాయి ప్రతిపాదనలు తమకు అందలేదని రాసిన లేఖను ఈ సందర్భంగా తెలిపారు. కేంద్ర జలవనరుల సంఘం మార్గదర్శకాలు, ట్రిబ్యునల్ నిర్ణయాలు, అంతర్ రాష్ట్ర ఒప్పందాలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజలకు సేవకులుగా ఉందాం

విశ్వంభర, చెన్నూర్ : నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటూ ఎలాంటి అక్రమ వ్యాపారాలకు తావు లేకుండా ప్రజలకు సేవకులుగా ఉంటూ వారి మన్ననలు పొందడమే తన లక్ష్యమని కార్మిక ఉపాధి శాఖ, భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మొట్టమొదటిసారిగా మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణానికి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికే ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. పదవులు ముఖ్యం కాదని, నియోజకవర్గ ప్రజలందరూ నాపై ఎంతో నమ్మకంతో నన్ను గెలిపించినందుకు రుణపడి ఉంటానని, అదే విధంగా అభివృద్ధి చేసి నిరూపిస్తాననిపేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఈ ప్రాంతం నుండి ప్రతిరోజు వేలాది లారీల అక్రమ ఇసుక రవాణా జరుగుతుండేదని, తాను గెలిచిన తర్వాత అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేశానని అది దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి తనకు మైనింగ్ శాఖ మంత్రిగా అవకాశం కల్పించారని అన్నారు. నియోజకవర్గంలో నూతన బొగ్గు గనుల ఏర్పాటుకు కృషిచేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. కాక వెంకటస్వామిని నియోజకవర్గ ప్రజలు ఎంతగానో అభిమానించి కేంద్ర మంత్రి వరకు అవకాశం కల్పించారని అప్పటినుండి ఇప్పటివరకు ఈ నియోజకవర్గ ప్రజల ఆధార అభిమానాలు తమ కుటుంబం పై అలాగే ఉన్నాయని, భవిష్యత్తులో అలాగే ఉండాలని, చెన్నూరు పట్టణాన్ని రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతానని అన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో పోడు భూముల సమస్య ఉందని ముఖ్యమంత్రితో మాట్లాడి బాధితులకు తగిన న్యాయం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు కోటపల్లి మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రణమో.. న్యాయ సమరమో తేల్చుకోవాలి

విశ్వంభర, అమరావతి: చట్టపరమైన చర్యలు ఎదుర్కొనేందుకు జగన్ సిద్ధంగా ఉండాలని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. శరణమో.. న్యాయ సమరమో తేల్చుకోవాలని స్పష్టం చేశారు. ఇక సమయం లేదని వ్యాఖ్యానించారు. సవాల్ చేస్తే జగన్‌కు సౌండ్ ఆఫ్ అయిందని ఆక్షేపించారు. బురద చల్లడం.. పారిపోయి ప్యాలెస్‌లో దాక్కోవడం జగన్‌కు అలవాటేనని దుయ్యబట్టారు. తల్లికి వందనం డబ్బులు తన జేబులోకి వచ్చాయంటూ చేసిన ఆరోపణలు 24 గంటల్లో నిరూపించాలని సవాల్ చేసిన సమయం ముగిసిందని పేర్కొన్నారు. రుజువు చేయలేదు.. క్షమాపణ కోరలేదని, అందుకే ఫేక్ జగన్ అనేది అని విమర్శించారు.

ఏపీలో డీఎస్సీ పరీక్షల తేదీలు మార్పు

విశ్వంభర, అమరావతి: ఏపీ ప్రభుత్వం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో డీఎస్సీ పరీక్షల తేదీల్లో మార్పులు జరిగాయి. ఈ నెల